క్లుప్తంగా

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా దీక్షలు


దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా రామాయంపేట పట్టణంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం నాటికి 14వ రోజుకు దీక్ష చేరుకుంది. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ప్రకటించే వరకు తాము దీక్షలు విరమించే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు. ఈ దీక్షలకు పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు తమ మద్దతు పలికారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం


విరాళం అందిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు మాజీ సర్పంచ్ ప్రవంతినవీన్‌కుమార్ గుప్తా రూ.51 వేలు విరాళం ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రవిగౌడ్, వెంకటేష్, అంజయ్య, గణేశ్, నాగేష్, మల్లేశ్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లింగం తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి ఆదివారం సర్పంచ్ శ్యాములు భూమిపూజ నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మెదక్ ఎమ్మెల్యే దేవేందర్‌రెడ్డి రూ. 5 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ


పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నర్సాపూర్: ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వ్యక్తులకు ఎన్ఎస్‌యూఐ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారికి పండ్లు బ్రెడ్డు పంపిణీ చేస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు మణిదీప్ చెప్పారు. కార్యక్రమంలో నాయకులు హర్షవర్దన్, ప్రభులింగం, వంశీ, ఆంజనేయులు, రవితేజ, చక్రి, ప్రశాంత్, సోఫి తదితరులు పాల్గొన్నారు.

నేడు మనోహరాబాద్‌లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మనోహరాబాద్(తూప్రాన్): నేడు మండల కేంద్రం మనోహరాబాద్‌లోని శుభం ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ భిక్షపతి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరూ ప్రతాప్ రెడ్డి అందజేయనున్నట్లు తెలిపారు.

'రూ.రెండు లక్షల రుణమాఫీ చేయిస్తాం'

చేగుంట(తూప్రాన్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఒకేసారి రెండు లక్షల చేయిస్తామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కువ మందికి పూరిగుడిసెలు ఉన్నాయని, వారందరికి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్లు నిర్మించుకునేందుకు రూ. 5లక్షలు అందిస్తామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఆత్మగౌరవ యాత్ర చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్ల నవీన్, స్టాలిన్, గాండ్ల రమేశ్, మైలారం అరుణ్, శ్రీనివాస్, బాల్‌రెడ్డి, కొండి శ్రీను, అన్నం అంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిధులు లేక.. పనులు సాగక..

- పలు గ్రామాల్లో నిలిచిపోయిన భవన నిర్మాణాలు
- అవస్థలు పడుతున్న ప్రజలు, విద్యార్థులు


కాళ్లకల్‌లో స్లాబ్ స్థాయిలోనే నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనం

మనోహరాబాద్(తూప్రాన్): అభివృద్ధి పనులకు ఆయా గ్రామాల్లో భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. ఆర్భాటంగా పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇది మనోహరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితి. మండలంలోని కాళ్లకల్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి పనులు ప్రారంభించి స్లాబులు వేసి, వదిలేశారు. కాగా మూడేళ్లుగా గ్రామ పంచాయతీ నిర్వహణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగిస్తున్నారు. దీంతో ఇటు విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

- గ్రామ పంచాయతీ భవనం ఎప్పుడు పూర్తవుతుందో.. పాఠశాల నుంచి ఎప్పుడు ఖాళీ చేసి, వెళ్తారోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.
- ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో యూత్ భవనం, గ్రంథాలయం కోసం స్లాబ్స్ వేసి అలాగే వదిలేశారు.
- వెంకటాపూర్ అగ్రహారంలో నిధులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిల్చిపోయాయి.
- మహిళా భవనం, గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా మిగిలాయి.
- పాలాటలో గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉన్నాయి.
- ఈ విషయమై సర్పంచ్‌లను వివరణ కోరితే.. భవన నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే వారిని ఒప్పించి పనులు ప్రారంభించామన్నారు. కానీ నిధులు రాకపోవడంతో పనులు ఎలా పూర్తవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అధికారులు దృష్టి సారించి నిధులు వచ్చేలా, పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


వెంకటాపూర్ అగ్రహారంలో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

పనులు పూర్తి కాలేదు



గ్రామంలో ప్రారంభించిన గ్రామ పంచాయతీ భవనం, అంగన్‌వాడీ భవనం, మహిళా భవనాలు చివరి దశకు వచ్చాయి. నిధులు వస్తే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. నూతన గ్రామ పంచాయతీ కావడంతో భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నాం. పనులు పూర్తి కాగానే సొంత భవనానికి వెళ్తాం.

– రేణుక, సర్పంచ్, వెంకటాపూర్ అగ్రహారం

సమస్యలు తప్పడం లేదు



గ్రామ పంచాయతీ విధులను ఉన్నత పాఠశాలలో నిర్వర్తిస్తుండటంతో సమస్యలు తప్పడం లేదు. నిత్యం పాఠశాల వద్ద పలు పనుల కోసం వచ్చే వారితో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యగా మారింది. గ్రామ పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు ఇక్కట్లు కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఎస్‌కే ఇర్ఫాన్, కాళ్లకల్

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయం డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో హోరెత్తింది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి, మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్ల శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించడంతో పాటు వాహనాలకు పూజలు చేయించుకున్నారు. భక్తులకు మంచి నీరు, వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు బోనాలు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రం అల్లాదుర్గం బేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గమ్మకు మహిళలు బోనాలు ఊరేగించి, సమర్పించారు. బోనాల ఎదుట శివసత్తుల నృత్యాలు అలరించాయి. మూడు రోజులుగా బేతాళస్వామి జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతోంది. వందలాది మంది మహిళలు, చిన్నారులు ఉత్సవాలను తిలకించేందుకు తరలి వచ్చారు. సోమవారం బేతాళ స్వామికి బోనాలు తీయనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.


బోనాలతో భక్తులు

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం


అల్లాదుర్గం మండల మున్నూరుకాపు నూతన కార్యవర్గం

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా మున్నూరి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా అకుల రాజు, కోశాధికారిగా మున్నూరి నరేశ్, కార్యదర్శిగా అకుల రమేశ్, సలహాదారులు కిష్టయ్య, చెటారి నారాయణ, సభ్యులుగా వెంకయ్య, భూమయ్య, బాగయ్య, చంద్రశేఖర్, నవీన్, బేతయ్య, సురేశ్, లింగమయ్య, ప్రభాకర్ ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో 1991 – 92 సంవత్సరంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ పూర్వ విద్యార్థులు కౌడిపల్లి మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయ ఆవరణలో కలుసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కిష్టాగౌడ్, ప్రకాశ్, ధర్మారెడ్డి, విష్ణువర్దన్, ఈశ్వర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయంగా కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి

గజ్వేల్‌రూరల్: ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు కౌన్సిలర్ బొగ్గుల చందు అన్నారు. పట్టణంలో కోట మైసమ్మ గుడి దగ్గర ఆదివారం ఏర్పాటు చేసిన హోమియోపతి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రజలు ఆరోగ్యం పై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి మందులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకులంలో వివిధ తరగతుల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రవంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోఆర్డినేటర్ సంపత్ ఆదేశాలతో 2023 – 24 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు చెప్పారు. మినీ గురుకులంలో ఒకటవ తరగతిలో 30 సీట్లు ఉండగా రెండవ తరగతిలో 17, మూడవ తరగతిలో 10, నాల్గవ తరగతిలో 3 బ్యాక్ లాగ్ సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. మండలానికి చెందిన గిరిజన బాలికలు మాత్రమే అర్హులన్నారు. ఒకటవ తరగతిలో చేరేందుకు 5 ఏళ్ల వయసు ఉన్నవారు, మిగతా తరగతుల్లో చేరేందుకు ప్రస్తుతం చదువుతున్న బాలికలు, తల్లిదండ్రులు ఆదాయపు ధ్రువీకరణ పత్రంతో పాటు బర్త్ సర్టిఫికెట్, కులం, ఆదాయం, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు జత చేసి గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి గురుకుల పాఠశాలలో మే 4 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 10వ తేదీన జిల్లా అదనపు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన విద్యార్థినులను ఎంపిక చేస్తామన్నారు.

'ఆలె నరేంద్ర సేవలు మరువలేనివి'


నరేంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు దివంగత ఆలె నరేంద్ర తెలంగాణ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆలె నరేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్, కృష్ణ, సురేష్, సంగమేశ్వర్, అనిల్, భూమేష్, విలాస్ తదితరులున్నారు.

బీజేపీ కరపత్రం ఆవిష్కరణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామాల ప్రజలకు తెలియజేయడానికే పల్లె పల్లెకూ బీజేపీ.. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా నాయకుడు రాములు అన్నారు. ఆదివారం మండలంలోని కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీల కోసం చేపట్టిన అభివృద్ధి పనులు, పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తామని తెలిపారు. మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు కృష్ణమూర్తి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

'మహేందర్ కుటుంబానికి అండగా ఉంటాం'

తొగుట(దుబ్బాక): ఇటీవల విద్యుత్ షాక్‌కు గురైన బండారుపల్లి మహేందర్ కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితిని మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింలు, ధనుంజయ ఉన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం


కౌడిపల్లి(నర్సాపూర్): చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని మార్కెట్‌లో ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చలివేంద్రం ప్రారంభించారు. తైబజార్ నిర్వాహకులు బర్ల కృష్ణ, సుధాకర్ చలివేంద్రం ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవి కాలం సందర్భంగా మార్కెట్‌కు వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు తైబజార్ నిర్వాహకులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ రాజునాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సార రామాగౌడ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యుడు తిరుమలేశ్, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, నాయకులు అమర్‌సింగ్, రాజు, కృష్ణ, సుధాకర్‌తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టే వారిని ప్రోత్సహించాలని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండల కేంద్రం శివ్వంపేట బస్టాండ్ వద్ద దివంగత నర్సింలుగౌడ్ జ్ఞాపకార్థం అతని కొడుకు త్రినేష్‌గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచ్ పద్మ, అశోక్, గౌరీశంకర్, షేక్‌అలీ, ఖాదీర్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవాలు

చేగుంట(తూప్రాన్): నేటి నుంచి మండల కేంద్రం చేగుంటలోని వేంకటేశ్వరస్వామి ఆలయ 40వ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్త సుదర్శన్‌రావు తెలిపారు. 10న పుణ్యావాచనం, విష్ణు సహస్రపారాయణం, 11న హోమం , 12న వేంకటేశ్వర స్వామి కల్యాణం, 13న సుదర్శన హోమం, రథోత్సవం, 14న ద్వాదశ ఆరాధన, శ్రీపుష్పయాగం, 15న స్వామివారికి 108 కలషాలతో అభిషేకం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. చిన్నజీయర్ శిష్య బృందంతో నిర్వహింపబడే ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.


ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

ఆలయ గోపురంపై శిఖర ప్రతిష్ఠ

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ శివారులోని శ్రీ గోనె మైసమ్మ ఆలయం వద్ద ఈ నెల 23 నుంచి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కాగా ఆలయం గోపురాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం మధుసూదన్ ముందుకొచ్చారు. సుమారు రూ.2 లక్షల వ్యయంతో నిర్మించిన గోపురం పనులు పూర్తి కావడంతో ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో మధుసూదన్ కుటుంబ సభ్యులు మహేశ్, భార్గవి, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశం, వార్డు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్కాపూర్‌లో కొనసాగుతున్న స్వచ్ఛభారత్


చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని గ్రామస్తులు, యువత నిర్వహించారు. పరిసర ప్రాంతాలను, సీసీరోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే చెట్లకు పాదులు చేశారు. గ్రామంలో ఇప్పటివరకు నిరంతరాయంగా 354 వారాలుగా స్వచ్ఛభారత్‌ను చేస్తున్నామని ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


చేగుంట(తూప్రాన్): సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు


కౌడిపల్లి(నర్సాపూర్): సీఎస్ఐ చర్చి వద్ద ..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని సీఎస్ఐ చర్చ్‌లో ఆదివారం ఘనంగా ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రభుదాస్, శాంసన్, సుధాకర్, సిద్ధిరాములు, అభిలాష్, పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఫాస్టర్ రేవ రమేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు గుడ్‌ఫ్రైడే రోజు మరణించి, మూడు రోజుల అనంతరం తిరిగి బతకడంతో ఈస్టర్ వేడుకలను నిర్వహిస్తామని ఫాస్టర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చి వద్ద క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ దైవ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్ చర్చ్‌లో ఈస్టర్ పండగ నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల క్రైస్తవులు , జయపాల్‌నాయక్ పాల్గొన్నారు.


మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో..

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి మండల పూజ

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి మండల పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. క్షేత్రం నిర్వాహకుడు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై అష్టోత్తర శత 108 కలశాలతో 108 రకాల సుగంధ ద్రవ్యాలు, 108 రకాల మూలికలతో విశేష పంచామృత ఫలరసాలతో కలశ స్థాపన పూజ నిర్వహించారు. తిరుత్తరణి సుబ్రహ్మణ్య ఆలయ అర్చకులు గోపి గురుకుల్, శివకుమార్ గురుకుల్ తదితర పండితులు పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్య మూలమంత్ర త్రిశతి హవనం జరిగింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సుబ్రహ్మణ్య స్వామి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తామని హరినాథశర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుదర్శన్ రెడ్డి, విఠల్, మల్లికార్జున్, రాజేంద్ర ప్రసాద్, నర్సింహ్మారెడ్డి, అనిల్‌కుమార్, మర్యాల రవీందర్, తిరుపతిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు